సాక్షి
వనపర్తి
గురువారం । 16 । మార్చి । 2023



మే లోగా పనులు పూర్తి

అలంపూర్‌లో ప్రసాద్‌స్కీం పనులు మే నాటికి పూర్తి చేస్తామని డీఈ ధన్‌రాజు తెలిపారు.

వివరాలు 8లో ▸



విద్యార్థులే కీలకం

కళాశాల అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని యూజీసీ న్యాక్ బృందం పేర్కొంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /21.3

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సెట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో సెట్ (స్టేట్ ఎలిజబిలిటీ టెస్టు) ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. ఇందులో కామర్స్, పొలిటికల్ సైన్స్‌కు సంబంధించిన 280 మంది అభ్యర్థులకు 245 మంది హాజరయ్యారు. గురువారం కూడా మరికొన్ని సెబ్జెక్టుల వారికి పరీక్ష జరగనుంది.


విద్యలో ముందుండాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యలో పాలమూరు ముందుండాలని డిగ్రీ కళాశాలల జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన ఎంతో మంది విద్యార్థులు జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన విద్యను పొందుతున్నారన్నారు. గ్రామీణ స్థాయి విద్యార్థులు సైతం పోటీ పరీక్షల్లో సత్తా చాటుతున్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలకు మంచి న్యాక్ గ్రేడింగ్ వచ్చే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెబ్బేటి మల్లికార్జున్ తెలిపారు. ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులైన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేసి, పీజీలో కనిష్ఠంగా 55శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులని, సెట్, నెట్, పీహెచ్‌డీ, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి



దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. రైతులు పెద్ద ఎత్తున అమ్మకానికి తేవడంతో మార్కెట్ కళకళలాడింది. దాదాపు 3వేల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో జోరుగా వేలం పాటలు నడిచాయి. ఉదయం 10గంటలకు ప్రారంభమైన వేలం మధ్యాహ్నం వరకు కొనసాగింది. వ్యాపారులు వేలంలో పోటీపడి కొనుగోలు చేశారు. వానాకాలం సీజన్‌లో దిగుబడులు లేకపోవడం వల్ల రైతులు యాసంగి సీజన్‌లో ఎక్కువగా ఉల్లిని పండించారు. దీంతో దిగుబడులు బాగా రావడంతో రైతులు నేరుగా మార్కెట్‌కు అమ్మకానికి తెస్తున్నారు.

■ వేలంలో ఉల్లి ధరలు స్వల్పంగా పెరిగాయి. క్వింటాల్ గరిష్టంగా రూ.1,320, కనిష్టంగా రూ.700 వరకు ధరలు లభించాయి. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి దిగుబడులు వస్తుండడంతో ధరలు బాగా పడిపోయాయి. అంతర్రాష్ట్ర ధరలను అనుసరించి ఇక్కడి మార్కెట్‌లో వ్యాపారులు ధర నిర్ణయిస్తారు. చాలా మంది తమ ఇంటి అవసరాల కోసం ఉల్లిని కొన్నారు. 45 కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.700, కనిష్టంగా రూ.350 వరకు విక్రయించారు. మార్కెట్‌లో వినియోగదారులతో పాటు, ఇతర ప్రాంతాల వ్యాపారుల సందడి కనిపించింది.

మొక్కజొన్న క్వింటా రూ.2,211

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,211, కనిష్టంగా రూ.1,829 ధరలు లభించాయి. అదేవిధంగా వేరుశనగకి గరిష్టంగా రూ.7,555, కనిష్టంగా రూ.5,300, పెబ్బర్లు గరిష్టంగా రూ.5,215, కనిష్టంగా రూ.4,506, కందులు గరిష్టంగా రూ.7,630, కనిష్టంగా రూ.6,656, ఆముదాలు గరిష్టంగా రూ.6,460, కనిష్టంగా రూ.6,300, ఉలువలు రూ.4,789, జొన్నలు రూ.5,810, ధాన్యం రూ.1,489 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఈనామ్ టెండర్లలో ఆముదాలు గరిష్టంగా రూ.6,319 ఒకే ధర పలికింది.

వేరుశనగ క్వింటా రూ.7,690

కల్వకుర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 458 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. క్వింటా గరిష్టంగా రూ.7,690, మధ్యస్తంగా రూ.7170, కనిష్టంగా రూ.6241 ధర లభించాయి.

తాగునీరు అందేనా?

నత్తనడకన మిషన్ భగీరథ అనుబంధ పథకం పనులు



గోపాల్‌పేట శివారులో కొనసాగుతున్న ప్లాంట్ పనులు

- 85 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రెండుచోట్ల ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
- సుమారు రూ.300 కోట్ల వ్యయం
- పనులు ప్రారంభమై రెండున్నర ఏళ్లయినా పూర్తికాని వైనం
- గడువుదాటి ఏడాదిన్నర కావస్తున్నా.. కనిపించని పురోగతి

వనపర్తి: ప్రస్తుతం కొనసాగుతున్న మిషన్ భగీరథ పథకంతో జిల్లాకు సరిపడా తాగునీరు అందడం లేదని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.300 కోట్లతో చేపడుతున్న మిషన్ భగీరథ అనుబంధ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. 12 నెలల వ్యవధిలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో 2020, సెప్టెంబర్ 12న పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద 75 ఎంఎల్‌డీ సామర్థ్యంతో, గోపాల్‌పేట శివారులో 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పంప్‌హౌస్‌ల నిర్మాణం, సుమారు 58.07 కిలోమీటర్ల పైప్‌లైన్, గౌరీదేవిపల్లి వద్ద పంపింగ్, గ్రావిటీ సంపు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్దేశిత గడువు ముగిసి ఏడాదిన్నర కావస్తోంది. ఇప్పటికే మంత్రితో పాటు మిషన్ భగీరథ ఉన్నతాధికారులు పలుమార్లు ఇంజినీర్లతో పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహించినా.. వేగం పుంజుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది వేసవిలోనే ఈ స్కీంతో తాగునీరు అందించాలనే ప్రయత్నం చేసినా.. పనులు పూర్తికాకపోవడంతో ఆశలు వదులుకున్నారు.

➲ నిబంధనల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కొక్కరికి రోజుకు 100 లీటర్లు, పట్టణ ప్రాంతాల్లో 130 లీటర్ల నీటిని ఇవ్వాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకం రూపొందించారు. జిల్లాలోని గోపాల్‌పేట, రేవల్లి, వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలంలోని కొంత భాగం, శ్రీరంగాపూర్ మండలంలోని కొంతభాగంలోని గ్రామాలకు లక్ష్యంలో కనీసం 50 శాతం నీటి సరఫరా కావటం లేదని ప్రతి జెడ్పీ సమావేశం, మండల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు నిలదీసినా.. కాంట్రాక్టర్లు, అధికారుల్లో మార్పు రాకపోవటం గమనార్హం. ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన మిషన్ భగీరథ మెయిన్ గ్రిడ్, ఇంట్రాలకు రామన్‌పాడు, శ్రీరంగాపూర్, గోపల్‌దిన్నె, కానాయపల్లి రిజర్వాయర్ల నుంచి నీటిని తరలించి శుద్ధిచేసి ఆయా ప్రాంతాల్లోని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఏటా వేసవి ప్రారంభం కాగానే ఈ రిజర్వాయర్లకు జూరాల నుంచి నీటి సరఫరా నిలిచిపోతుంది. రిజర్వాయర్లలో నీటిమట్టం తగ్గగానే తాగునీటి కష్టాలు తలెత్తుతున్నాయని.. రెండో స్కీం మంజూరు చేయించుకుంటే పనులు నత్తనడకన సాగటంతో ఇబ్బందులు తప్పడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పాత ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులకు అనుసంధానం చేసేలా..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ కొత్త స్కీంతో రెండుచోట్ల ఏకకాలంలో 85 ఎంఎల్‌డీ నీటిని శుద్ధిచేసి ఇదివరకు ఇంట్రాలో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ (భూ ఉపరితల) నీటి ట్యాంకులకు సరఫరా చేసి అక్కడి నుంచి కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంటుంది.

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటి సేకరణ..

వేసవిలో జూరాల నీటి సరఫరా నిలిచిపోయినప్పుడు సమస్య ఉత్పన్నమవుతుందని.. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాలను ఎల్లూరు వద్ద నిర్మించే ఇన్‌టెక్‌వెల్‌కు తరలించి అక్కడి నుంచి రేవల్లి మండలం గౌరీదేవిపల్లి వద్ద నిర్మించే సంపులకు పంపింగ్ చేయాలని నిర్ణయించారు. అనంతరం అక్కడి నుంచి గ్రావిటి ద్వారా గోపాల్‌పేట, పెద్దమందడి మండలం బుగ్గపల్లి తండా శివారులోని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేసిన తర్వాత జిల్లాలోని 393 గ్రామాలకు తాగునీరు అందించాలనేది కొత్త స్కీం ముఖ్య ఉద్దేశం. కానీ పనుల పురోగతిని చూస్తే ఈసారి కూడా తాగునీరు అందించే పరిస్థితులు కనిపించటం లేదు.

> **మార్చి చివరి నాటికి 52 గ్రామాలకు..**
>
> 
>
> పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ వేసవిలో సమస్య ఎక్కువగా ఉన్న గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని 52 గ్రామాలకు గోపాల్‌పేట శివారులో నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటిశుద్ధి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి తాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. మోటార్లు తెప్పించాం.. వారంలో బిగించి నీటి సరఫరా చేపట్టేలా పనులు వేగంగా కొనసాగుతున్నాయి.
>
> – జగన్మోహన్, ఎస్‌ఈ, మిషన్ భగీరథ, వనపర్తి



పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద నిర్మాణంలో ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జిల్లాకేంద్రంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

- కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ వార్షిక పరీక్షలు బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. తొలిరోజు పరీక్షకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 7,034 మందికిగాను 6,779 మంది హాజరు కాగా, 255 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష కొనసాగగా.. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉండటంతో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్, డీఓలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాలను నిర్దేశిత సమయంలో ఓపెన్ చేసి, పరీక్ష అనంతరం సీల్ చేశారు. పలు కేంద్రాలను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు డీఐఈఓ జాకీర్ హుస్సేన్ తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

పకడ్బందీగా నిర్వహించాలి..

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం డీవీఈఓ జాకీర్ హుస్సేన్‌తో కలిసి జిల్లాకేంద్రంలోని స్కాలర్స్, ఉర్దూ మీడియం, బాలికల జూనియర్ తదితర పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్స్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు.



ఖిల్లాఘనపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్

నిబంధనలు పాటించాలి..

ఖిల్లాఘనపురం: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తహసీల్దార్ భానుప్రకాష్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులతో పాటు వసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ రాధను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.



వనపర్తిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు వరుసలో నిలబడ్డ విద్యార్థులు

చేనేత సహకార సంఘాల పదవీకాలం పొడిగింపు



అమరచింతలో కార్మికుల వివరాలు సేకరిస్తున్న చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య

అమరచింత: చేనేత సహకార సంఘాల పదవీకాలం మరో ఆరునెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చేనేత జౌళీశాఖ ఏడీ గోవిందయ్య బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 30 సంఘాల పాత పాలకవర్గాలే ఆగస్టు 9 వరకు కొనసాగుతాయని వివరించారు. చేనేత, సిల్క్, ఉన్ని సహకార సంఘాలకు తెలంగాణ సహకార సంఘం చట్టం 1964 ప్రకారం ఇది వర్తిస్తుందన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 17, వనపర్తిలో 9, నాగర్‌కర్నూల్‌లో 4 చేనేత సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు.

చేనేత కార్మికుల కోసం ప్రత్యేక పోర్టల్..

మగ్గంపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికుల వివరాలను సేకరించి వాటిని ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేశామని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నామని చేనేత, జౌళీశాఖ ఏడీ గోవిందయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి మగ్గాలపై స్వయంగా చీరలు తయారు చేస్తున్న కార్మికులతో పాటు అనుబంధ కార్మికుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేతమిత్ర పోర్టల్‌ను రూపొందించి వాటిలో ప్రస్తుతం మగ్గం నేస్తున్న వారి లైవ్ ఫొటోలను తీసుకొని అప్‌లోడ్ చేస్తామన్నారు. వీటితో పాటు కార్మికుడి బ్యాంకు ఖాతా, ఆధార్, కుటుంబ వివరాలు, ఇతర స్కీం వివరాలు, మగ్గం కింద పనిచేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామని వివరించారు. దీంతో కార్మికులందరూ లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కో–ఆర్డినేటర్లతో ఇంటింటి సర్వే చేపట్టామని.. ప్రస్తుతం జియో ట్యాగింగ్ నంబర్ల ప్రకారం మగ్గాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట డీఓ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

చేపల పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మత్స్య కళాశాల ప్రొఫెసర్లు

పెబ్బేరు: పట్టణంలోని మత్స్య కళాశాలలో షెడ్యూల్డ్ కులాల మహిళా రైతులకు బుధవారం చేపల చెరువులు.. యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. నాగలక్ష్మి, ప్రొఫెసర్లు ఐదు రోజుల శిక్షణలో భాగంగా కమ్యూనిటీ చెరువులో దాణా నిర్వహణ, చేప విత్తనాల నిల్వ, చెరువుల నిర్వహణ, చేపల పెంపకం, ఆధునిక పద్ధతులు, వ్యాధుల గుర్తింపు, నియంత్రణ, ప్రాసెసింగ్, చేపలు పట్టుకొనే విధానం తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో డా. ముత్తప్పఖవీ, మోహన్, శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

వనపర్తి: ప్రతి మండలంలో రోజుకు వెయ్యి మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీఓలు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతకు నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా రోజూ నీరందించాలని, షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సీడ్‌బాల్స్ తయారీపై దృష్టి సారించాలని, ప్లాంటేషన్ కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి సంరక్షణ చర్యలను సంబంధిత శాఖ పర్యవేక్షించాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌పై అధికారులతో చర్చించారు. ఎఫ్‌టీఓ జనరేట్ చేయాలని, జాతీయ పంచాయతీ అవార్డు సాధనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల వివరాలు, కూలీల హాజరు తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం జియో సిమ్‌లను అందజేశారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

చైతన్యంతోనే మోసాల నియంత్రణ

- అదనపు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి రవికుమార్

వనపర్తి క్రైం: వినియోగదారుల చైతన్యంతోనే మోసాలను నియంత్రించవచ్చని వనపర్తి అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని దత్తాయిపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వస్తువుల కొనుగోలులో అవకతవకలు జరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలుదారులకు అన్యాయం జరిగితే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చని తెలిపారు. లోక్ అదాలత్, ఉచిత న్యాయసేవలు న్యాయసేవాధికార సంస్థ ద్వారా మహిళలు పొందవచ్చని, పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చూడాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి రవికుమార్

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి రవీందర్

ఖిల్లాఘనపురం: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా విద్యాధికారి రవీందర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బా విద్యాలయాలు, సోళీపురం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణ, గతంలో విద్యార్థులు రాసిన పరీక్షల జవాబు పత్రాలు, మన ఊరు – మన బడి పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పరీక్షలంటే భయం వీడి ప్రశాంత వాతావరణంలో రాయాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలు శ్రద్ధగా వినడంతో పాటు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. తర్వాత ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు ప్రణాళికతో చదివేలా సూచనలు ఇవ్వాలని కోరారు. అలసత్వం వహించకుండా ప్రతి విద్యార్థిని గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లలిత, సురేందర్‌రెడ్డి, అరుణాదేవి, ఫర్హానా, ఉపాధ్యాయులు, సీఆర్పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ

నేడు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన 18–28 ఏళ్లలోని విద్యార్థినులు, మహిళలు అర్హులని, యశస్వీ అండ్ గూడ్స్ కంపెనీ వారి ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు సెల్ నం. 9110523925కు సంప్రదించాలని పేర్కొన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ తొలగింపు

అమరచింత: సకాలంలో ఇంటి పన్ను చెల్లించని ఇళ్లకు కొళాయి కనెక్షన్ తొలగించి నీటి సరఫరా నిలిపివేస్తామని పుర కమిషనర్ మహ్మద్ ఖాజా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వందశాతం ఇంటి పన్ను వసూలుకు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పన్ను వసూళ్లకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి చెల్లించాలని సూచించారు. కొందరు ఉద్యోగులు కూడా పన్నులు చెల్లించకుండా సిబ్బందిని పరుష పదజాలంతో దూషిస్తున్నారని.. అలాంటి వారి వివరాలను ఆయా శాఖల ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 70 శాతం వసూలయ్యాయని.. మార్చి చివరి నాటికి వందశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కృష్ణయ్య, సిబ్బంది ప్రభాకర్, తిప్పన్న, హరికృష్ణ, ప్రేమ్‌కుమార్, రవి పాల్గొన్నారు.



కొళాయి కనెక్షన్ తొలగిస్తున్న పుర సిబ్బంది

క్రీడల్లో ఉన్నతంగా రాణించాలి

ఏఎస్పీ షాకీర్ హుస్సేన్

వనపర్తి క్రైం: హాకీ ఇండియా మొదటిసారిగా జోనల్ టోర్నమెంట్ నిర్వహిస్తోందని, ఇందులో రాణించిన క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించి ఇండియా హాకీ జట్టుకు ఎంపిక చేస్తారని అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్ తెలిపారు. జాతీయస్థాయి సౌత్ జోన్ పోటీలకు ఏడుగురు బాలురు, ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 19 నుంచి 26 వరకు తమిళనాడులోని మధురైలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడామైదానంలో క్రీడాకారులకు ఏఎస్పీ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. హాకీ ఇండియాకు 816 మందిని ఎంపిక చేయగా, ఇప్పటి వరకు జాతీయస్థాయిలో 100 మందికి పైగా ఆడారన్నారు. ఈ క్రీడల్లో రాణించిన ఎందరో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, అనేకమంది ఉన్నత చదువులకు వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుమార్, కోచ్‌లు వహీద్, సాగర్, రామ్మోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ షాకీర్ హుస్సేన్

క్లుప్తంగా

నీటి డ్రమ్ములో పడి బాలుడి మృతి

తెలకపల్లి: నీటి డ్రమ్ములో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం మండలంలోని కార్వంగ చెందిన గోపస్ లక్ష్మయ్య కుమారుడు గోపస్ నిఖిల్ (3) అన్నం తిని ప్లేట్ కడిగేందుకు బాత్రూంలోకి వెళ్లాడు. డ్రమ్ములో ఉన్న నీరు అందకపోవడంతో బకెట్‌ను బోర్లా వేసి నీటిని అందుకునే ప్రయత్నం చేశాడు. నీరు తీసే క్రమంలో బకెట్‌పై నుంచి నీటి డ్రమ్ములో పడిపోయాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు ఎవరూ లేకపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. ఆ తర్వాత బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల పరిసరాల్లో గాలించారు. చివరగా బాత్‌రూంలో చూడగా నీటి డ్రమ్ములో శవమై కనిపించాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హోటల్ బాత్రూంలో సెక్యూరిటీ గార్డు మృతి

జడ్చర్ల: పట్టణంలోని శ్రీకర్ గ్రాండ్ రెస్టారెంట్ హోటల్ రెండవ అంతస్తులో బాత్రూంలో సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ రమేష్‌బాబు కథనం మేరకు.. హోటల్‌లో వడ్ల నారాయణా చారి(48) సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం రెండవ అంతస్తులో బాత్రూం నుంచి దుర్వాసన రావడంతో సిబ్బంది తెరిచే ప్రయత్నం చేశారు. లోపల గడియ పెట్టి ఉండడంతో తలుపు బద్దలు కొట్టి చూడగా నారాయణచారి మృతి చెంది ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆరగిద్ద గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి భార్య వడ్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రెండు రోజుల కిందట హోటల్‌లోని మరుగుదొడ్డికి వెళ్లిన నారాయణచారి అక్కడే మృతి చెందగా ఎవరూ గమనించకపోవడంతో దుర్వాసన రావడంతో విషయం బయటకు వచ్చింది.

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గోపాల్‌పేట: భర్త వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. మండలంలోని మున్ననూరు చెందిన జ్యోతికి కొల్లాపూర్‌కు చెందిన నాగరాజుకు ఏడాదిన్నర కిందట వివాహమైంది. అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధిస్తుండడంతో ఆరు నెలల క్రితం అమ్మాయి సొంత గ్రామం మున్ననూరులో వదిలి వెళ్లాడు. కట్నం తీసుకువస్తేనే తన ఇంటికి రానిస్తానని చెప్పడంతో జ్యోతి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆవుదూడపై వీధి కుక్కల దాడి

లింగాల: కుక్కలు మనుషులపై దాడి చేయడమే గాక మూగ జీవాలను సైతం వదలకపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని కోమటికుంటలో ఆవుదూడపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మామిళ్లపల్లి బాలచంద్రయ్య గ్రామ సమీపంలో ఉన్న తన పొలంలోని కొట్టంలో పశువులను కట్టి ఉంచాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా ఆవుదూడపై దాడి చేసి చెవులను, ముఖంపై ఉన్న చర్మాన్ని పీకేశాయి. పక్క పొలంలో ఉన్న రైతు వెంకటేష్ గమనించి కుక్కలను తరిమికొట్టడంతో దూడ ప్రాణాపాయం నుంచి బయటపడింది. వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటే బాగుంటుందని గ్రామస్తులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

సోమశిల అడవిలో కార్చిచ్చు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న అడవిలో బుధవారం రాత్రి కార్చిచ్చు రేగింది. అడవిలో మంటలు ఎగిసిపడుతుండగా సమీపంలో ఉన్న రైతులు మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఇంట్లో నగదు చోరీ

లింగాల: మండలంలోని అవుసలికుంటకు చెందిన రంగినేని శ్రీనివాసరావు ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ అయినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఇంట్లో వారందరూ హైదరాబాద్‌లో ఉండగా ఇంటి యజమాని కూలీలకు చెల్లించాల్సిన రూ.లక్షను ఇటీవల ఇంట్లో ఉంచి వెళ్లాడు. ఉదయం చోరీ అయినట్లు గుర్తించిన ఇంటి పని మనిషి యజమానికి సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పని మనిషి ఊర్మిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అచ్చంపేటలో ఆభరణాలు..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగి అబ్రహం ఇంటికి తాళం వేసి మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యానికి వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం విరగ్గొట్టి ఉండటం, బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రెండున్నర తులాల బంగారు, 25తులాల వెండి చోరీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని రెండవ ఎస్‌ఐ రవి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మే లోగా ప్రసాద్ స్కీం పనులు పూర్తి



అప్రోచ్ రోడ్డుకు ఇబ్బందులను చూయిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి

- టూరిజం శాఖ డీఈ ధన్‌రాజ్
- హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థల పరిశీలన

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలో చేపట్టిన ప్రసాద్ స్కీం పనులు మే మొదటి వారం నాటికి పూర్తి చేస్తామని టూరిజం శాఖ డీఈ ధన్‌రాజు తెలిపారు. పట్టణంలో చేపడుతున్న పనులను పరిశీలించేందుకు బుధవార అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, డీఈ, ఏఈ అనురాగ్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ కిశోర్, సైట్ ఇంజినీర్ రామకృష్ణ వచ్చారు. మూడు అంతస్తుల భవన నిర్మాణం వారు చూశారు. కాగా అక్కడి నుంచి జోగుళాంబ పుష్కరఘాట్ వెళ్లేందుకు వేస్తున్న అప్రోచ్ రోడ్డు పనులను వారు పరిశీలించారు.

రోడ్డు పనులకు ఇళ్లు అడ్డు

కోటగోడను ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మించారని, రోడ్డును ఆక్రమించి కట్టారని అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దీంతో పర్యాటకుల రాక కోసం వేసే అప్రోచ్ రోడ్డుకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. బ్రాహ్మణ వీధిలో దత్తాత్రేయ స్వామి గుడికి అటూ ఇటూ నిర్మించి ఇళ్లన్నీ వెనుకవైపు కోటగోడ ముందు ఉన్న రోడ్డు స్థలాలను ఆక్రమించారని తెలిపారు. ఇంటి స్థలాలను, వాటి పత్రాలను పరిశీలించి ఆక్రమణ అయినట్లు నిర్ధారణ అయితే వాటిని తొలగించాల్సి వస్తుందన్నారు.

ప్రహరీ నిర్మాణానికి అభ్యంతరం

ప్రసాద్ స్కీం కింద రక్షిత నవబ్రహ్మ ఆలయాల భద్రత కోసం నిర్మించే ప్రహరీ గోడ పనులు చేపట్టేందుకు ఆలయాల సమీపంలోని కొంత మంది స్థానికులు అభ్యంతరం తెలిపారు. గతంలో తమ ఇళ్లు అక్కడ ఉండేవని తమను ఖాళీ చేయించి తమకు సరిపడ నష్టపరిహారం చెల్లించలేదని, ఇప్పుడు మళ్లీ ప్రహరీ కడితే తమకు అన్యాయం అవుతుందని అధికారులతో చెప్పారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం 7 హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు, లైట్లు అమర్చేందుకు ఆలయ ఈఓ పురేందర్ కుమార్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. అదే విధంగా లేజర్ లైటింగ్ షో కోసం ఇటీవల చూసిన మ్యూజియం భవన కొలతలు వారు సేకరించారు.

కర్ణాటక భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



భక్తులతో కిక్కిరిసిన అలంపూర్ ఆలయ పరిసరాలు

జోగుళాంబ శక్తిపీఠం: కర్ణాటక రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులతో అలంపూర్ క్షేత్రం కిక్కిరిసింది. వారిని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు చలువ పందిళ్లు వేశారు. ఆలయ పరిసరాలలో అన్నదానాలు, అల్పాహారాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా వారు స్నానాలు ఆచరించేందుకు కొళాయిలను ఏర్పాటు చేశారు. స్థానికులు కూడా రహదారి వెంట అన్నదానాలు చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు రోడ్డు పొడవున టీస్టాల్, మినీ ఫుడ్, టిఫిన్ సెంటర్లను ఏర్పాటు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టు కొనసాగిస్తున్నారు. అలంపూర్‌లో బస చేసిన భక్తులు నది దాటి బ్రాహ్మణ కొట్కూరు, నందికొట్కూరు మీదుగా శ్రీశైలం వెళ్తున్నారు.



పాదయాత్రగా వస్తున్న కర్ణాటక భక్తులు



ఆలయంలో భక్తులకు అన్నదానం

నిప్పంటుకుని గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తున్న పోలీసులు

పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లిలో మంగళవారం రాత్రి వడ్డె శేఖరమ్మకు చెందిన గుడిసెకు నిప్పంటించిన వారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. కంచిరావుపల్లి చెందిన వడ్డె శేఖరమ్మ తమ అక్క కూతురుని తీసుకరావడానికి ఖిల్లాఘనపూర్‌కు వెళ్లింది. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన వడ్డె మన్యం మంగళవారం రాత్రి తన భార్య కనిపించడంలేదని తిరుగుతూ అనుమానంతో గుడిసెకు నిప్పుపెట్టాడు. దీంతో గుడిసె పూర్తిగా కాలిపోవడంతో పాటు గ్యాస్ సిలిండర్ పేలి పక్కన పాఠశాలలోకి ఎగిరిపడింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి వడ్డె మన్యంపై కేసు నమోదు చేశారు.

ఇసుక నిల్వలు సీజ్



మహమ్మదాబాద్: వ్యవసాయ పంట పొలాల్లో నిల్వ చేసిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. మండలంలోని కంచన్‌పల్లి రెవెన్యూ శివారులో వాగు నుంచి కొందరు వ్యాపారులు అనుమతి లేకుండా ఇసుకను నిల్వ చేసుకున్నారు. ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు వెళ్లి రెండు ఇసుక నిల్వలను సీజ్ చేశారు. 30 నుంచి 50 ట్రాక్టర్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఇసుకను ప్రభుత్వ పనులకు వాడుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కాలి బూడిదైన దుకాణం

భూత్పూర్: మండలంలోని కప్పెటలో మంగళవారం అర్ధరాత్రి కిరాణ దుకాణం దగ్ధమైంది. గ్రామానికి చెందిన యాదయ్య ఇంట్లోనే ఓ గదిలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే పక్క గదిలోనే కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్నారు. మధ్యరాత్రి కాలిన వాసన రావడం గమనించిన యాదయ్య తలుపు తెరిచి చూడగా దుకాణంలో ఉన్న ఫ్రిడ్జ్, కిరాణ సామగ్రి, టేబుల్ అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుదాఘాతంత కాలేదని విద్యుత్ సిబ్బంది తెలిపారని, దుకాణం దగ్ధమయ్యేందుకు కారణాలు తెలియడం లేదని సర్పంచ్ వేణుగోపాల్ తెలిపారు.



కప్పెటలో దగ్ధమైన కిరాణ దుకాణం

టవర్ అప్‌గ్రేడ్ చేస్తామంటూ మోసం

రూ.52వేలు తీసుకుని.. ఫోన్ స్విచ్ఛాఫ్

మహమ్మదాబాద్: సెల్‌ఫోన్ టవర్ అప్‌గ్రేడ్ చేస్తామని, దానికి నెలకు అద్దె ఇస్తామంటూ ఫోన్ రావడంతో నమ్మి, డబ్బులు పోగొట్టుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన మహిపాల్‌గౌడ్ పొలంలో సెల్‌ఫోన్ టవర్ ఉంది. దీన్ని 5జీ సర్వీస్ అప్‌గ్రేడ్ చేస్తామని దానికి రూ.10వేల అద్దె ఇస్తామని ఫిబ్రవరి 1వ తేదీన ఓ ఫోన్ వచ్చింది. దీనికి మీరు అగ్రిమెంట్ చేసుకోవాలని ఫోన్‌లో చెప్పారు. ఆయన నమ్మి రూ.52,650 ఆన్‌లైన్‌లో పంపించాడు. రెండు రోజుల తర్వాత వివరాలు తెలుసుకుందామని ఫోన్ చేసి స్విచ్ఛాఫ్ చేశారు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

వైట్నర్ సేవిస్తున్న మైనర్లకు కౌన్సెలింగ్

గద్వాల క్రైం: పట్టణ శివారులో బుధవారం సాయంత్రం ముగ్గురు మైనర్లు వైట్నర్ సేవిస్తున్నట్లు గుర్తించి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెడు వ్యసనాల బారిన పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఈ విషయంపై ఎస్‌ఐ అబ్దుల్‌షకుర్‌ను వివరణ కోరగా.. మత్తు కలిగించే ద్రవాన్ని వారి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. మైనర్లు కావడంతో వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురికి జైలు శిక్ష

రాజోళి: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ కుర్మయ్య తెలిపారు. మండలంలో నిర్వహించిన తనిఖీలో పట్టుబడిన ఆరుగురిని అలంపూర్ కోర్టుకు పంపగా, అందులో నలుగురికి రెండు రోజుల చొప్పున, ఇద్దరికి ఒక రోజు చొప్పున జడ్జి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. వారిని బుధవారం మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక

నారాయణపేట రూరల్: మహిళా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని నారాయణపేటకు చక్కటి గుర్తింపు తేవాలని డీవైఎస్‌ఓ కృష్ణమాచారి అన్నారు. ఖేలో ఇండియా జిల్లా స్థాయి ఉమెన్ అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ విభాగంలో రాణించాలని, ఆటల వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, భవిష్యత్‌లో స్పోర్ట్స్ కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. అనంతరం 16 సంవత్సరాలు పైబడిన బాలికలకు పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రోకు సంబందించి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారు ఈనెల 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సెక్రెటరీ రమణ, జగదీశ్, నర్సింహులు, పీఈటీలు పర్వీన్, అక్తర్, భరత్, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ కృష్ణమాచారి

మహిళను వేధించిన వ్యక్తి రిమాండ్

జడ్చర్ల: వల్లూరుకు చెందిన పోలె శ్రీకాంత్‌ను బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని రంగారావుతోటలో నివాసం ఉంటున్న నిందితుడు మంగళవారం రాత్రి ఒక మహిళ ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఆమె ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ అమ్మాయిలను వేధించిన, పోలీస్ అధికారులపై తిరగబడిన, చుట్టపక్కల వారిని కొట్టిన కేసులు ఉన్నాయని ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



ఊట్కూర్: మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. 14 మందిపై కేసులు చేశారు. గ్రామంలో ఇళ్లు, దుకాణాలు, వెల్డింగ్ షాపులను తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నందున కేసులు నమోదు చేశారు. ఏడీఈ నందకిశోర్, ఏఈలు అనిల్ కుమార్, రవికాంత్, మహ్మద్ రఫి దాడుల్లో పాల్గొన్నారు.

వినూత్న బోధనపై రాష్ట్రస్థాయిలో గుర్తింపు

ఉపాధ్యాయుడికి అభినందన

గద్వాల: జిల్లాకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రవిశంకర్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ విద్యావిధానం- విద్యా అమృత్ మహోత్సవాలలో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ వినూత్న బోధన పద్ధతులపై ఆన్‌లైన్ ద్వారా పోటీలను నిర్వహించింది. ఉండవెల్లి మండలం పుల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రవిశంకర్ అధునాతన సాంకేతికతను జోడించి విద్యార్థులకు పాఠాలను ఆసక్తికరంగా బోధిస్తున్నాడు. ప్రత్యేకంగా ఓ యాప్‌తో తన సెల్‌ఫోన్‌ను ప్రొజెక్టర్‌కు అనుసంధానించి స్క్రీన్‌పై బొమ్మలను చూపిస్తూ పాఠ్యాంశాలను అర్థమయ్యేలా వివరిస్తున్నారు. వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్‌ను అమర్చి బోధించే పద్ధతి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. రాష్ట్రవ్యాప్తంగా వంద వినూత్న బోధన పద్ధతులను పరిశీలించారు. ఇందులో అత్యుత్తమైన ఐదింటిని ఎన్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసింది. ఇందులో రవిశంకర్ బోధన పద్ధతి ఉండటం విశేషం. బోధన పద్ధతులను వీడియోలను ప్రభుత్వం రూపొందించిన దీక్ష పోర్టల్‌లో ఉంచారు. అత్యధిక వీక్షకులు వీక్షించే వీడియోలలో టాప్-3 బోధన పద్ధతులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. రెండు, మూడు రోజులలో జాతీయ స్థాయి ఎంపిక పోటీలకు సంబంధించిన బోధన పద్ధతులను అధికారికంగా ప్రకటించనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించిన ఉపాధ్యాయుడు రవిశంకర్ బోధన పద్ధతి జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపిక అవుతుందని డీఈఓ సిరాజుద్దీన్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం తన ఛాంబర్‌లో రవిశంకర్‌ను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఇందిరా, ఎస్తేర్‌రాణి, సురేష్, హంపయ్య, వీరాశేఖర్, ఆనంద్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయుడు రవిశంకర్‌ను అభినందిస్తున్న డీఈఓ సిరాజుద్దీన్

మహిళ బలవన్మరణం

జడ్చర్ల: మండలంలోని మాచారం చెందిన యాదమ్మ (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితి కేసుగా నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మృతురాలి కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈమె రెండు మూడు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుందని, రోజులాగే మంగళవారం రాత్రి 8:30గంటల సమయంలో అందరూ కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత గదిలోకెళ్లి పడుకున్నామని ఫిర్యాదులో పొందుపర్చారు. బుధవారం ఉదయం 9గంటలు దాటినా గదిలోనుంచి బయటకు రాకపోవటంతో వెళ్లి చూడగా చీరతో పైకప్పు ఇనుపకొండికి ఉరేసుకుని ఉండటాన్ని గుర్తించారు. ఆమె మృతిపై సందేహం ఉందని తెలియటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నది దాటుతుండగా యువకుడి గల్లంతు

- మక్తల్ మండల వాసిగా గుర్తింపు
- కాలినడకన శ్రీశైలం వెళ్తుండగా ప్రమాదం
- గాలింపు చర్యలు చేపట్టి మృతదేహం వెలికితీత



సిద్ధిరామ్ (ఫైల్)

అలంపూర్: శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న యాత్రికుడు ప్రమాదవశాత్తు తుంగభద్ర నదిలో మునిగి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీలోని తుంగభద్ర పుష్కర ఘాట్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం సంగంబండకు చెందిన సిద్దిరామ్(22) కొంత మందితో కలిసి శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన బయలుదేరాడు. అలంపూర్ చేరుకున్న వారు స్నేహితులతో కలిసి తుంగభద్ర నదిలో ఈదుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించారు. నదిలో ఒడ్డుకు చేరుకోలేక మధ్యలోనే మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానిక జాలర్ల సాయంతో గాలింపు చేపట్టారు. గాలింపుల్లో సిద్దిరామ్ మృతదేహం వెలికితీసినట్లు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. తండ్రి మల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరు రైతులు మృతి

- వారి పంట పొలాల సమీపానే ప్రమాదం
- గ్రామంలో విషాదఛాయలు

కల్వకుర్తి రూరల్: ఇద్దరు స్నేహితులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి వెళ్తుండగా కారు రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. వివరాలు ఇలా.. మండలంలోని తుర్కలపల్లి చెందిన రైతులు దుర్గయ్య (44), రామస్వామి (46) స్నేహితుల పంట పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. రామస్వామి పశువులను తీసుకురావడానికి దుర్గయ్య ద్విచక్రవాహనంపై ఎక్కి పొలానికి బయలుదేరారు. నాగర్‌కర్నూల్-కల్వకుర్తి ప్రధాన రహదారిపైకి రాగానే గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

❐ దుర్గయ్యకు 8ఎకరాలు, రామస్వామికి 6 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. రామస్వామికి భార్య, కుమార్తె, కుమారుడు ఉండగా, దుర్గయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా చదువుకుంటున్నారు.

విషాదఛాయలు



రామస్వామి (ఫైల్)



దుర్గయ్య (ఫైల్)

గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒకే సారి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో తుర్కలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా గ్రామస్తులంతా అక్కడికి చేరుకున్నారు. మృతి చెందిన ఇరు కుటుంబాలలో పిల్లలంతా చిన్నవారు కావడంతో పాటు విద్యాభ్యాసం చేస్తుండడంతో వారి పరిస్థితి తలుచుకుంటూ రోదించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌యాదవ్ తెలిపారు.

నేడు పరీక్ష.. అంతలోనే తండ్రి మృతి

ప్రమాదంలో మృతి చెందిన దుర్గయ్య కుమారుడు శివ గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. పరిక్షకు సిద్ధమయ్యే కుమారుడికి తండ్రి మరణం కలిచివేసింది. ఇదిలా ఉంటే మృతి చెందిన రామస్వామి కుమార్తె ప్రశాంతి హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాసింది. బుధవారం మొదటి పరీక్ష అయిపోయాక తండ్రి మరణ వార్త విని కుమిలిపోయింది.

అబద్ధాలు అచ్చేసిన రామోజీని సభకు పిలిచి విచారించాలి

తప్పు కేశవ్‌దో.. రామోజీదో తేలాలి

సభా హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గవర్నర్‌ను అవమానించారంటూ ఈనాడు కథనంపై అధికారపక్ష సభ్యుల మండిపాటు
- గవర్నర్‌కు స్వాగతం పలికిన దృశ్యాల వీడియో సభలో ప్రదర్శన
- ఎల్లో మీడియా దుష్ప్రచారంపై సభలో ప్రత్యేక చర్చ జరపాలని విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: చట్ట సభను, రాజ్యాంగ వ్యవస్థను, గవర్నర్‌ను కించపరిచేలా అబద్ధాలను ఈనాడులో అచ్చేసి రామోజీరావు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని, ఆయన్ను సభకు పిలిచి విచారించి, కఠిన చర్యలు తీసుకోవాలని శాసనసభలో అధికారపక్షం డిమాండ్ చేసింది. సీఎం రాకకోసం గవర్నర్ వేచి ఉండాలా అని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నట్టు ప్రస్తావిస్తూ ఈనాడు రాసిన తప్పుడు కథనంపై బుధవారం శాసనసభ అట్టుడికింది. గవర్నర్‌ను కించపరుస్తూ ఈనాడు అచ్చేసిన కథనంపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ కమిటీ విచారణ చేపట్టి కేశవ్ తప్పు మాట్లాడారా.. రామోజీ తప్పు రాశారా.. అనే విషయం తేల్చాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు పట్టుబట్టారు. ఈనాడు వార్త క్లిప్పింగ్‌లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించిన సభ్యులు.. ఎల్లో మీడియాను ఏకిపారేశారు. అలాంటి వ్యాఖ్యలు తాను చేయలేదని దమ్ముంటే నిరూపించాలని పయ్యావుల కేశవ్ అనడంపై అధికారపక్ష సభ్యులు మండిపడ్డారు. సభకు దమ్ము ధైర్యం అని సవాలు చేయవద్దని, కేశవ్ తప్పు మాట్లాడినా, ఈనాడు తప్పు రాసినా ప్రివిలేజ్ కమిటీ విచారణలో నిర్ధారణ అయితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ చర్చకు అడుగడుగునా టీడీపీ సభ్యులు అడ్డుతగలడంతో సభ దృష్టికి వాస్తవాలు తెచ్చేందుకు తొలిరోజున గవర్నర్‌కు స్వాగతం పలికిన వీడియోను ప్రదర్శించి సభ్యులకు వాస్తవాలు చూపించారు. అయినప్పటికీ పయ్యావుల కేశవ్ పదే పదే వాదనకు దిగడంతో గవర్నర్ విషయంలో ఆయన చేసిన కామెంట్ల వీడియో సైతం సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, అధికారపార్టీ నేతలు మాట్లాడారు.

రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే: మంత్రి బుగ్గన



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలకడంలో ప్రొటో కాల్ పాటించలేదంటూ అబద్ధపు రాతలు రాయడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా వెళ్లి గవర్నర్‌కు ఘనస్వాగతం పలికి సభలోకి తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఉదయం 9.45 గంటలకు అసెంబ్లీకి వచ్చారు. 9.53కు గవర్నర్ వచ్చారు. గవర్నర్‌ను రిసీవ్ చేసుకున్న సీఎం 10.02 గంటలకు స్పీకర్ చాంబర్‌కు తీసుకొచ్చారు. గవర్నర్‌కు గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన అభ్యర్థన మేరకు కొంత సేపు ఆగి ఆయన రెడీ అయిన తర్వాత గౌరవ సభలోకి తీసుకొచ్చాం. ప్రభుత్వ పనితీరు, విజన్‌ను గవర్నర్ చదివితే.. ఆ ప్రసంగాన్ని సైతం టీడీపీ సభ్యులు చాలా హేళన చేశారు. తప్పుడు వార్తలతో గౌరవ సభను, గవర్నర్‌ను అవమానిస్తూ కథనాలు రాసిన ఈనాడుపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్పీకర్‌ను కోరుతున్నా.

ఆ రాతలు గవర్నర్, సీఎంలను అవమానపరిచేవే..

- ఈనాడు రాతలను సీరియస్‌గా పరిగణించాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం రూలింగ్

సాక్షి, అమరావతి: సీఎం కోసం గవర్నర్ ఎదురు చూడాలా? అంటూ ఈనాడు పత్రికలో వచ్చిన కథనాన్ని చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గవర్నర్‌కు స్వయంగా ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికినప్పటికీ, అవాస్తవ అంశాలతో టీడీపీ సభ్యుడు పయ్యావుల కేశవ్ మాట్లాడినట్లుగా ఈనాడు ప్రచురించిన కథనంపై స్పీకర్ తమ్మినేని రూలింగ్ ఇస్తూ.. గవర్నర్, సీఎం పదవుల ఔన్నత్యాన్ని, మండలి ఛైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌తో పాటు మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమానపరిచే ఆ రాతలపై స్పష్టమైన, కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం సభలో స్పీకర్ మాట్లాడుతూ.. ''గవర్నర్ కార్యక్రమంలో నేనే ప్రత్యక్ష సాక్షిని. సీఎం, నేను, మండలి ఛైర్మన్ వెళ్లి ఆయనను సగౌరవంగా రిసీవ్ చేసుకున్నాం. గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన డైరెక్షన్ ప్రకారమే గవర్నర్ స్పీకర్ చాంబర్ వద్ద ఆగి లోపలికి వచ్చి గొంతు సమస్యకు వేడి నీటిని తాగి సభకు బయలుదేరారు (గవర్నర్ కార్యాలయం డైరెక్షన్ వివరాలను స్పీకర్ సభలో చదివి వినిపించారు). వాస్తవం ఇలా ఉంటే, ఈ రోజు ఈనాడులో తప్పుడు కథనం చూశాక, ఇది చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అంశం అని భావిస్తున్నాను. మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమాన పరిచే ఈ రాతలను సభ సీరియస్‌గా తీసుకుంటుంది. గవర్నర్ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కాదు. తప్పు కేశవ్‌దా, పత్రికదా అనే విషయం ప్రివిలేజి కమిటీ సిఫార్సులు సూచిస్తాయి. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రివిలేజి కమిటీ హియరింగ్స్ తర్వాత తప్పనిసరిగా సభలో ప్రకటన చేస్తాను. ఆ మాటలు మాట్లాడిన సభ్యుడు అన్నీ ప్రివిలేజి కమిటీ ముందు చర్చించవచ్చు'' అని చెప్పారు.

బీజేపీ.. ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుంది!

- ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లుతున్నారు
- బీజేపీ సమాధులు తవ్వితే బీఆర్ఎస్ పునాదులు వేస్తోంది
- మంచిర్యాల జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు విమర్శలు



సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో హరీశ్‌రావు, ఇంద్రకరణ్, బాల్క సుమన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/చెన్నూరు: 'బీజేపీ ప్రజలను కాకుండా ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుని గెలవాలని చూస్తోంది. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లి, అబద్ధాలను ప్రచారం చేస్తోంది' అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. బుధవారం ఆయన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలసి మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతూ.. బీజేపీ చేసిన ఒక్క మంచి పని ఉందా? అని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడం, సంస్థలు అమ్మేయడం చేస్తోందని దుయ్యబట్టారు. ఇక్కడి రెండు బొగ్గు బ్లాక్‌లను వేలం వేసి, సింగరేణిని అమ్మాలని చూస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. సమాధులు తవ్వే బీజేపీ కావాలో, పునాదులు వేసే బీఆర్ఎస్ కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. అభయహస్తం వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రం నుంచి కరువును తరిమేశారని కొనియాడారు. చెన్నూరు ఎత్తిపోతలతో ఇక్కడి రైతాంగానికి రెండు పంటలకు అవకాశం కలుగుతుందని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు.

పేపర్ లీక్‌పై ఉద్యమించండి

- రాష్ట్ర బీజేపీకి అధిష్టానం ఆదేశం!
- లీక్‌పై అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని, కమిషన్ నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టాలని రాష్ట్ర నాయకత్వానికి బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశించినట్టు సమాచారం. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన ఉద్యోగాల భర్తీ విషయంలో కేసీఆర్ సర్కార్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా వివిధ రూపాల్లో ఆందోళన, ఇతర కార్యక్రమాలను చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నది విద్యార్థి లోకం, యువతరమే కాబట్టి, వీరి మద్దతును కూడగట్టే దిశలో ముందుకెళ్లాలని జాతీయ నాయకత్వం ఆదేశించినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా జాతీయ పార్టీ ఆదేశాలతో కదిలిన రాష్ట్ర నాయకత్వం.. లీకేజీ వ్యవహారంపై అధ్యయనానికి వివిధ రంగాల్లో అనుభవమున్న పార్టీ నేతలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్ కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో.. మాజీ ఐఏఎస్ చంద్రవదన్, మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్, లీగల్ కేసుల్లో అనుభవమున్న ఎస్.రామచంద్రరావు, కరుణా గోపాల్, ఎన్‌డీఎంఏ మాజీ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జర్నలిస్ట్ ఎస్.కుమార్ సభ్యులుగా ఉన్నారు.

నేడు టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ... : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన గురువారం పార్టీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ కానుంది. లీకేజీ అంశంపై ఎలా ముందుకెళ్లాలి? ఏయే విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి? సాంకేతిక అంశాలు ఎలా పరిశీలించాలి? తదితర అంశాలపై చర్చించనున్నారు. లీకేజీలో ఎవరెవరి ప్రమేయముందో తేల్చడంతో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన ఆందోళన కార్యక్రమాలు ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

టీఎస్‌పీఎస్సీ ఎదుట ఆందోళన చేసిన బీజేవైఎం కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న వాళ్లను వదిలేసి న్యాయం కోసం పోరాడుతున్న వారిని అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయని, అందుకు కారకులైన వారిని వదిలేసి పోరాడుతున్న వారిపై కేసులు పెట్టడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. లీకేజీ అంశంపై ప్రభుత్వం 'సిట్'ఏర్పాటు చేయడాన్ని సంజయ్ తప్పుపట్టారు. గతంలో నయీం కేసు, డ్రగ్స్ కేసు, డేటా చోరీ సహా సిట్‌కు అప్పగించిన కేసులన్నీ నీరుగారిపోయాయని గుర్తుచేశారు.

ప్రశ్నించే వారి గొంతునొక్కడమేంటి: డీకే అరుణ

పోటీ పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతగాని కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేమిటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఓ ప్రకటనలో నిలదీశారు.

ఏపీని విడగొట్టింది కేసీఆర్ కాదు... కాంగ్రెస్

బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడగొట్టింది కేసీఆర్ కాదని, కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఏపీని కాంగ్రెస్ విడగొడితే బీజేపీ సహకరించిందని, వైసీపీ, టీడీపీ లేఖలు ఇచ్చాయని గుర్తు చేశారు. కర్నూల్, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం తెలంగాణ భవన్‌లో తోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టిన కేసీఆర్ పార్టీలో ఎందుకు చేరారని కొందరు తనను అడుగుతున్నారని, అందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేసీఆర్ గొంతెత్తారని వివరించారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఊహించని విధంగా అభివృద్ధి చెందిందని కొనియాడారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ తరహా అభివృద్ధి ఏపీలో కావాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే పలు వురు నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కర్నూల్ కార్పొరేటర్ ముస్తాక్, సాయితేజ్, రామాపురం ప్రకాశం, ఎంఆర్‌పీఎస్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలపై ఫిర్యాదు చేసిన షర్మిల



రేఖాశర్మకు వినతి పత్రం ఇస్తున్న షర్మిల తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ : బీఆర్ఎస్ నేతలపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో బుధవారం జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మను వైఎస్సార్ టీపీ నాయకులతో పాటు వైఎస్ షర్మిల కలిశారు. ఈ సందర్భంగా తనను బీఆర్ఎస్ నేతలు అసభ్యకరంగా దూషించిన వీడియోలను మహిళా కమిషన్‌కు చూపించారు. మహిళలనే గౌరవం బీఆర్ఎస్ పార్టీకి లేదని, పాదయాత్ర చేస్తున్న తనపై దాడులకు దిగుతున్నారని, బహిరంగంగా ఎలా బయట తిరుగు తావో చూస్తాం అంటూ బెదిరిస్తున్నార ని రేఖా శర్మ వివరించారు. తెలంగాణలో మహి ళలకు గౌరవం, రక్షణ లేదని...ఆడవాళ్లంటే వ్రతాలు చేసుకోవాలని మంత్రి కేటీఆర్ వ్యా ఖ్యానిస్తున్నారని షర్మిల తెలిపారు. ప్రజా సమస్యలను తను ఎత్తి చూపిస్తే శిఖండి అని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని షర్మిల మండిపడ్డారు. తను ఇచ్చిన ఫిర్యాదుపై రేఖా శర్మ సానుకూలంగా స్పందించారని.. అసభ్యకర పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారని మీడియాకు తెలిపారు.

'కత్తి'గట్టిన అనుమానం.. ఖాకీల మానవత్వం!



మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్తున్న పోలీసులు

కర్నూలు: కల్లూరులోని సుబ్బలక్ష్మీనగర్‌లో హత్యకు గురైన రుక్మిణి దేవి, రమాదేవిల మృతదేహాలకు కల్లూరులోని శ్మశాన వాటికలో బుధవారం సాయంత్రం పోలీసులే అంత్యక్రియలు నిర్వహించారు. తెలంగాణలోని వనపర్తికి చెందిన వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతుల కుమార్తె రుక్మిణి దేవికి కల్లూరులోని సుబ్బలక్ష్మీ నగర్‌కు చెందిన ప్రసాద్, క్రిష్ణవేణి దంపతుల కుమారుడు శ్రావణ్ కుమార్‌కు ఈనెల 1వ తేదీన వనపర్తిలో వివాహమైంది. పెళ్లయిన రెండు వారాలు గడవకముందే భార్యపై అనుమానం పెంచుకుని శ్రావణ్ కుమార్ తన తండ్రి ప్రసాద్‌తో కలసి మంగళవారం భార్యతో పాటు అత్తను కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ దాడిలో మామ వెంకటేశ్వర్లు కూడా తీవ్ర గాయాలతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం, బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆయన భార్యాబిడ్డలకు పోలీసులే కల్లూరు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, హెడ్ కానిస్టేబుల్ హసన్ ఆధ్వర్యంలో ఈ తంతు పూర్తయింది. పోలీసులపై ప్రజల్లో ఇప్పటికీ నెలకొన్న అపనమ్మకాన్ని తొలగిస్తూ.. తామూ మనుషులమేనని, తమకూ మనసుందని చాటిన తీరు ప్రతి ఒక్కరి గుండెను కరిగించింది.

కళాశాల అభివృద్ధిలో విద్యార్థులే కీలకం

- పీజీ కోర్సులు ప్రారంభించేందుకు కమిషనర్‌కు విన్నవించండి
- పూర్వ విద్యార్థుల సమావేశంలో న్యాక్ బృందం



కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న న్యాక్ బృందం

జడ్చర్ల టౌన్: కళాశాల అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమైందని యూజీసీ న్యాక్ బృందం చైర్‌పర్సన్ రీచాచోప్రా, మెంబర్ కో ఆర్డినేటర్లు కైలాష అగర్వాల్, మారియ ఆంథోనిరాజ్ అన్నారు. స్థానిక బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం న్యాక్‌బృందం సందర్శించింది. మొదటి రోజున కళాశాలలోని అన్ని విభాగాలను చూశారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకపోవటం, తల్లిదండ్రుల మద్దతు లేక విద్యార్థులు చదవలేకపోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి సరైన గైడ్ చేయాలన్నారు. ముఖ్యంగా వృత్తిపరమైన, శాస్త్రీయపరమైన సలహాలు ఇవ్వాలని తెలిపారు. కొందరు విద్యార్థుల్లో వివిధ రంగాల్లో ప్రతిభ ఉంటుందని, అయితే వారిని ప్రోత్సహించే వారు లేక వెలుగులోకి రాలేరన్నారు. చదువంటే కేవలం కోర్సులు పూర్తి చేయటం కాదని, కొందరిలో పాటలు పాడటం, సంగీతం, పెయింటింగ్, నృత్యం ఇలా విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరుస్తుంటారని వారికి సరైన సహకారం లభిస్తే ఆ రంగాల్లో ఎదుగుతారన్నారు. అలాంటి వారిని గుర్తించటం పూర్వవిద్యార్థుల బాధ్యత అన్నారు. అధ్యాపకులు, ప్రిన్సిపాల్, అధికారులు వస్తుంటారు.. పోతుంటారని, పూర్వవిద్యార్థులే ఇక్కడ శాశ్వతమన్నారు. పూర్వవిద్యార్థుల సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారని అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు వచ్చే నిధుల వినియోగంపైనా పూర్వ విద్యార్థులు మానిటరింగ్ చేయాలని సక్రమమైన మార్గంలో ఖర్చయ్యేలా చూడాలన్నారు. పదేళ్ల తర్వాత కళాశాల ఎలా ఉండాలని కోరుకుంటున్నారని ప్రశ్నించగా యూనివర్సిటీగా చూడాలని పూర్వ విద్యార్థులు సమాధానమిచ్చారు. స్పందించిన వారు యూనివర్సిటీ కావాలంటే ముందుగా పీజీ కోర్సులు ఉండాలని, అందుకు మీరేం చేస్తారన్నారు. పూర్వ విద్యార్థుల లెటర్‌ప్యాడ్‌పై వెంటనే కళాశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల ఉన్నతికి తల్లిండ్రులుగా మీ వంతు బాధ్యతను పోషించాలని, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. అంతకుముందు కళాశాలకు చేరుకున్న న్యాక్ బృందానికి ఎన్‌సీసీ విద్యార్థులు గాడ్‌ఆఫ్‌హానర్‌తో స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ కళాశాల గురించి, అన్ని విభాగ అధిపతులు వారి విభాగాల గురించి వివరించారు. బొటానికల్ గార్డెన్‌లో మొక్కనాటి నీళ్లు పోశారు. యోగా సెంటర్‌ను సందర్శించిన వారు యోగా అంటే ఆసనాలు వేయటం కాదని, అది మానసిక పరివర్తనకు కారణమయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. స్టేట్ హెర్బేరియం, బయోడైవర్సిటీ రీసెర్చ్ ల్యాబ్, బొటానికల్ గార్డెన్‌లను తిలకించి వారు సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాక్ బృందం గురువారం సైతం పర్యటించనుంది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో మొదటి రోజు పర్యటన ముగిసింది.



పూర్వ విద్యార్థులతో సమావేశమైన బృందం

బాలిక మృతిపై సమగ్రంగా విచారించాలి

- అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసనలు

లింగాల: మన్ననూర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని నిఖిత మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అఖిల పక్షం నాయకులు పాఠశాలలను మూసి వేయించి, నిరసన తెలిపారు. విద్యార్థిని మృతి చెంది రోజులు గడుస్తున్నా సంఘటన పూర్తి వివరాలు పాఠశాల యాజమాన్యం, పోలీసులు బయటపెట్టడం లేదని యుజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశన్నయాదవ్ ఆరోపించారు. సీఎం కూతురు కవిత విషయంలో వెంటనే స్పందించిన రాష్ట్ర మహిళా కమిషన్ విద్యార్థిని నిఖిత, మెడికో ప్రీతి ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థిని మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీ రాములు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పలు పాఠశాలలో విద్యార్థులు నిఖితకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, ఇందిరమ్మ, శంకర్‌నాయక్, విజయ్, మహేష్, జగదీష్, లక్ష్మీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో బంద్

ఉప్పునుంతల: విద్యార్థిని నిఖిత మృతికి నిరసనగా బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అఖిలపక్ష పార్టీలు, కుల, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. మండల కేంద్రంలోని షాపులు, పెట్రోలు బంక్‌లు ఉదయమే బంద్ చేయించారు. స్థానికంగా ఉన్న పాఠశాలల విద్యార్థులచేత తరగతులను బహిష్కరించారు. నిఖిత మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.



లింగాలలో నిరసన తెలుపుతున్న అఖిల పక్షం నాయకులు

పీహెచ్‌సీ పరిశీలన



మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాయకల్ప కింద ఎంపిక కావడంతో బుధవారం కేంద్ర బృందం డాక్టర్ ముత్తుకుమార్, డాక్టర్ శివకుమార్ ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులను చూశారు. వారి వెంట వైద్యాధికారి మనుప్రియా, డాక్టర్ శివకాంత్, వైద్య సిబ్బంది ఉన్నారు.

క్రీడాహబ్‌గా పాలమూరు

రూపుదిద్దుకుంటున్న మినీ స్టేడియం

- ప్రత్యేకంగా స్కేటింగ్ రింగ్ ఏర్పాటు
- మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు
- ఇండోర్ స్టేడియంలో ఆధునీకీకరణ పనులు పూర్తి



ఎంవీఎస్ కళాశాల మైదానంలో నిర్మాణమవుతున్న మినీ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం క్రీడలకు హబ్‌గా మారనుంది. ఇప్పటికే పలు స్టేడియంల నిర్మాణాలు అవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా సాగుతుండగా, స్టేడియం ఆధునీకీకరణ పనులు పూర్తయ్యాయి. మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీ కూడా ఏర్పాటైంది. ఇప్పుడు క్రీడాకారులకు జిల్లా కేంద్రంలో మరో మినీ స్టేడియం అందుబాటులోకి రానుంది. జిల్లా కేంద్రంలో క్రీడాభివృద్ధి కోసం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో మంత్రి కృషితో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం క్రీడాస్టేడియం నిర్మాణం పనులు ఊపందుకున్నాయి.

ఎంవీఎస్ కళాశాలలో మినీ స్టేడియం..

జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మిస్తున్నారు. రూ.2.65 కోట్లతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మినీ స్టేడియం ప్రధాన భవనం పనులు సాగుతుండగా, స్లాబ్ ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నారు. స్టేడియంలో ఇండోర్ హాల్‌తోపాటు మల్టీపర్పస్ హాల్, కార్యాలయ గదులు నిర్మించారు. మినీ స్టేడియంలో ఇండోర్ క్రీడలకు సంబంధించి షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా మైదానంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఎంవీఎస్ కళాశాలలో నిర్మించనున్న మినీ స్టేడియం నిర్మాణం పనులను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. పనులు వేగవంతం చేసేలా తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



మినీ స్టేడియంలోని గదులు

క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు



ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో నిర్మిస్తున్న మినీ స్టేడియంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇప్పటికే మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ దశలో ఉంది. ఈ స్టేడియాలు పూర్తయితే క్రీడాకారులకు మెరుగైన శిక్షణ లభిస్తుంది. జిల్లా క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో జిల్లా కేంద్రంలో స్టేడియంలో నిర్మిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడాభివృద్ధి పనులు చేస్తున్నారు. ఎంవీఎస్ కళాశాలలో మినీ స్టేడియం నిర్మాణమవుతుండడం సంతోషంగా ఉంది. ఔత్సాహిక క్రీడాకారులు మినీ స్టేడియాన్ని సద్వినియోగం చేసుకుని తమకు నచ్చిన క్రీడాంశాల్లో ప్రతిభచాటి మేటి క్రీడాకారుడిగా ఎదగాలి.

– నిరంజన్, టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మహబూబ్‌నగర్

స్కేటింగ్ రింగ్..

మినీ స్టేడియంలో ప్రత్యేక స్కేటింగ్ రింగ్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మైదానంలో కనీసం 40 మీటర్ల స్కేటింగ్ రింగ్ ఉమ్మడి జిల్లాలోనే మొదటగా ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఈ క్రీడపై ఔత్సాహిక క్రీడాకారులు ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది. యోగాసనాలు చేయడానికి యోగా వేదిక నిర్మాణం చేపట్టనున్నారు.